నేడు జేఎల్ఎం నియామక పరీక్షలు

గణేశ్‌నగర్, జూన్ 21: టీజీ ఎన్పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ కార్యాలయంలో ఏడవ విడత జూనియర్ లైన్‌మన్ పోస్టుల నియామకం చేపడుతున్నట్లు ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ తెలిపారు. జూనియర్ లైన్‌మన్ సర్టిఫికెట్ల పరిశీలన, స్తంభం ఎక్కించే పరీక్షలను ఈ నెల 22న ఉదయం 9 గంటల నుంచి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జేఎల్ఎం అభ్యర్థులకు వారి చిరునామాలకు రిజిస్టర్ పోస్ట్ ద్వారా కాల్ లెటర్లు పంపించామన్నారు. జేఎల్ఎం నియామక కమిటీ ద్వారా అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన, స్తంభం ఎక్కించడం పరీక్షలను పారదర్శకంగా నిర్వహిస్తామని తెలిపారు.

విద్యార్థుల జీవితాలతో చెలగాటం

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి

కలెక్టరేట్ ఎదుట అఖిలపక్ష విద్యార్థి సంఘాల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అఖిలపక్ష విద్యార్థి సంఘాలు

సుభాష్‌నగర్, జూన్ 21: నీట్ పరీక్ష పేపర్ లీక్, యూజీసీ నెట్ పరీక్షలు రద్దు చేస్తూ ఎన్‌టీఏ విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతోందని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి దుయ్యబట్టారు. శుక్రవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీట్‌లో అవకతవకలు జరిగాయని దేశ వ్యాప్తంగా ఆందోళనలు జరుగు తుండగానే ఇటీవల నిర్వహించిన యూజీసీ నెట్ పరీక్షను రద్దు చేస్తున్నట్లు ప్రకటించడం విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమడటమేనని అన్నారు. నీట్ పరీక్షలో మొత్తం 23లక్షల 33వేల 297మంది, యూజీసీ నెట్ పరీక్ష 11లక్షల మంది విద్యార్థులు రాశారని తెలిపారు. నెట్ పరీక్షను రద్దు చేయడం వెనక నీట్ అవకతవకలను మరిపించడం కోసమేనని అన్నారు. దీనిపై సుప్రీంకోర్టు జడ్జిచే న్యాయ విచారణ జరిపించాలని, దీనికి బాధ్యత వహిస్తూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఛైర్మన్ ప్రదీప్‌కుమార్ జోషి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రులు బండి సంజయ్ కుమార్, కిషన్‌రెడ్డి నీట్ విద్యార్థుల సమస్యలపై కేంద్రాన్ని ప్రశ్నించాలని లేని పక్షంలో వారి ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రామారపు వెంకటేష్, అరవింద్, ఎన్ఎస్ యూఐ నాయకుడు నీరాటి రామ్‌ప్రసాద్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నరేష్, వివిధ విద్యార్థి సంఘాల నాయకులు మామిడిపల్లి హేమంత్, రోహిత్, కనకం సాయిరాం, రామ్‌యాదవ్, ఇషాక్, వినయ్, సందీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కడుపుకోత తప్పదా



- ప్రైవేటు ఆస్పత్రుల్లో పెరుగుతున్న సిజేరియన్లు
- మొదటి కాన్పులో సాధారణ ప్రసవాలే చేయాలని ప్రభుత్వ ఆదేశాలు
- నిబంధనలు పాటించని ఆస్పత్రులు.. పట్టించుకోని అధికారులు

సుభాష్‌నగర్, జూన్ 21: చాలా వరకు ప్రైవేటు ఆసుపత్రుల్లో సిజేరియన్లు పెరుగుతున్నాయి. అవసరం లేకున్నా ప్రసవాల కోసం ఆపరేషన్ చేస్తుండగా వైద్యశాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని ప్రభుత్వం, అధికారులు చెపుతున్నా ప్రైవేటు ఆసుపత్రుల వైపే జనం పరుగులు పెడుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందిస్తున్న సేవలపట్ల ప్రజలకు విశ్వాసం కలిగించడంలో అధికారులు విఫల మయ్యారనే విమర్శలు ఉన్నాయి. మొదటి కాన్పు సాధారణ ప్రసవాలే చేయాలని ప్రభుత్వ నిబంధనలు ఉన్నాయి. వీటిని ఏ ప్రైవేటు ఆసుపత్రి పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. కొంత మంది ప్రైవేటు ఆస్పత్రుల వారు అవసరం లేకున్నా సిజేరియన్లు చేస్తున్నారని తెలుస్తోంది. దీనికి తోడు ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌళిక సదుపాయలు లేక, గైనిక్ వైద్యుల కొరత, సరిపడా సిబ్బంది లేక పోవడంతో ప్రజలు ప్రైవేటు ఆసుపత్రుల వైపు మొగ్గుచూపుతున్నారు. మరి కొంతమంది జాతకాలను నమ్మడంతో ఇష్టం వచ్చిన తేదీల్లో ప్రసవం చేయించుకోవచ్చనే ఆలోచనతో ప్రైవేటు ఆస్పత్రుల వైపు మొగ్గుచూపుతున్నట్లు తెలుస్తోంది.

● ఆపరేషన్లకే మొగ్గు

జిల్లాలో గతేడాదిగా 17వేలకు పైగా ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుత్రుల్లో ప్రసవాలు జరిగినట్లు లెక్కలు చెబుతున్నాయి. అందులో ప్రభుత్వ



ఆసుపత్రుల్లో 10,733 ప్రసవాలు జరుగగా, అందులో నార్మల్ డెలవరీ 3,689, సిజేరియన్లు 7,044 చేశారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో నార్మల్ డెలివరీ కేవలం 810 మాత్రమే కాగా 5,544 సిజేరియన్లు చేశారు. ఈ లెక్కలను పరిశీలిస్తే ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో జరుగుతున్న సిజేరియన్ల తీరు అర్థం చేసుకోవచ్చు. కొన్ని చోట్ల ప్రభుత్వ ఆసుపత్రుల్లో వసతులు సరిగా లేకపోవడం, పడకలు సరిపడా లేకపోవడం, డాక్టర్ల కొరత, సిబ్బంది కొరత వల్ల డెలివరీలు చేయడం ఆలస్యం అవుతుండడంతో గర్భిణీలు ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్తున్నారు. ఒక్కో సిజేరియన్ ఆపరేషన్ అన్ని ఖర్చులు కలుపుకుని దాదాపు రూ.50 వేల పైమాటే. పుట్టిన శిశువుకు కాస్తంత నలత కనిపిస్తే మరింత ఆర్థికభారం తప్పదు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు, అత్యవసరమైతేనే సిజేరియన్ చేసేలా చూడాల్సిన అవసరం ఉంది.

● సిజేరియన్లతో అనర్థాలు

సిజేరియన్లు చేయడం వల్ల మహిళల్లో పలు రకాల అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశముందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. సాధారణ డెలివరీల్లో పుట్టే చిన్నారుల కంటే సిజేరియన్లలో పుట్టే చిన్నారులకు అనేక రకాలైన సమస్యలు ఏర్పాడుతాయని అంటున్నారు. అదే విధంగా శస్త్ర చికిత్స జరిగేప్పుడు రక్తం ఎక్కువగా పోవడం వల్ల మహిళలకు ఇబ్బందు లు ఏర్పడే అవకాశం ఉంది. సాధారణ ప్రసవం అయినవారితో పోలిస్తే ఎక్కువగా విశ్రాంతి తీసుకోవాల్సి వస్తుంది. మహిళలు శారీరకంగా, మానసికంగా ఆరోగ్య సమస్యలను ఎదుర్కోవలసి వస్తుందని నిపుణులు పేర్కొంటున్నారు.

● సాధారణ ప్రసవంతో ప్రయోజనాలు

సాధారణ డెలివరీతో తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారు. సాధారణ ప్రసవం ద్వారా జన్మించిన పిల్లలకు రోగనిరోధక శక్తి ఎక్కువ. సాధారణ ప్రసవంలో శిశువులో శ్వాసకోశ సమస్యల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ప్రసవం అయిన వెంటనే తల్లి పాలను బిడ్డకు ఇవ్వడం వల్ల బిడ్డకు తల్లికి ఇద్దరికీ ఎంతో మేలు జరుగుతుంది. ఇకా చాలా రకాలుగా ప్రయోజనాలు ఉంటాయని వైద్య నిపుణులు తెలుపుతున్నారు.

బీజేపీ గూటికి సునీల్‌రావు?

- అంతటా అదే చర్చ
- సంజయ్‌ని కలువడంతో రాజకీయ కలకలం
- అదే బాటలో పలువురు బీఆర్ఎస్ కార్పొరేటర్లు
- కరీంనగర్ కార్పొరేషన్‌లో తాజా రాజకీయం

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ సునీల్‌రావు బీజేపీలో చేరుతున్నారా..? కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్‌ను కలిసి అభినందించడం.. స్మార్ట్ సిటీకి ఆయన సహకారం ఎంతో ఉందని ప్రశంసలు కురిపించడం పార్టీ మారుతున్నా రనడానికి సంకేతాలా..? అంటూ జిల్లా రాజకీయవర్గాల్లో జోరుగా చర్చసాగుతోంది. సునీల్‌రావు మాత్రమే కాకుండా స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్, మేయర్ సునీల్‌రావుకు అత్యంత సన్నిహితులైన కార్పొరేటర్లు కూడా సంజయ్ కుమార్‌ను కలువడం రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకున్నది.

అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాతే పలువురు బీఆర్ఎస్ కార్పొరేటర్లు కాంగ్రెస్ పార్టీకి క్యూ కట్టేందుకు ప్రయత్నించగా మంత్రి పొన్నం ప్రభాకర్ వెంటనే గేట్లు తెరవకుండా ఆచీతూచీ వ్యవహరించడంతో ఆ ప్రయత్నాలకు బ్రేక్ పడింది. కొందరు కార్పొరేటర్లు ఇటీవల కాంగ్రెస్‌లో చేరినా పలువురికి గ్రీన్ సిగ్నల్ లభించ లేదు. దీనితో వారంతా బీజేపీలో చేరేందుకు సిద్ధమయ్యారంటూ నెలరోజులుగా ప్రచారం జరుగుతుండగా ఇప్పుడు ఆ ప్రచారానికి బలం చేకూరినట్టయింది. బీఆర్ఎస్ పార్టీకి కరీంనగర్‌లో బలమైన కీలకనేతగా భావించే సునీల్‌రావు మాజీ ఎంపీ, మాజీ ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ వెన్నంటి ఉంటూ ఆయనకు బలమైన శక్తిగా నిలిచేవారు. పలు సందర్భాల్లో స్మార్ట్‌సిటీ ప్రదాతగా వినోద్‌కుమార్‌ను పేర్కొంటూ ఎంపీ బండి సంజయ్‌కుమార్ బీజేపీ కీలకనేత అయినా కూడా స్మార్ట్‌సిటీ మంజూరులో, నిధులు తీసుకురావడంలో ఏమాత్రం చొరవ చూపలేదని ఆయన ప్రమేయం లేదని విమర్శలు చేశారు.అయితే ఇపుడు ఇందుకు భిన్నమైన పరిస్థితి ఏర్పడడానికి సునీల్‌రావు కారణమయ్యారు. కేంద్రమంత్రిగా బాధ్యతలు చేపట్టి కరీంనగర్‌కు వచ్చిన బండి సంజయ్ కుమార్‌



ను సునీల్‌రావు కలిసి అభినందనలు తెలుపడంతో పాటు కరీంనగర్‌ను స్మార్ట్‌సిటీగా అభివృద్ధి చేసేందుకు ఆయన సహకరించారని ప్రశంసించడం రాజకీయంగా పెద్ద చర్చకు తెరతీసింది.

ఇంతకాలం స్మార్ట్‌సిటీ ఏర్పాటులో సంజయ్ ప్రమేయమే లేదని చెబుతూ వచ్చిన సునీల్‌రావు ఒక్కసారిగా ప్లేట్ ఫిరాయించడం ఆయన బీజేపీలో చేరాలని భావిస్తుండడం వల్లే కావచ్చు అనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. సునీల్‌రావు సంజయ్‌కుమార్‌ను కలిసిన మరుసటి రోజే ఆయనకు, ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌కు అత్యంత సన్నిహితులుగా ఉండే ఎడ్ల అశోక్, గందె మహేశ్, జంగిలి ఐలేందర్‌యాదవ్, కచ్చు రవి కూడా వెళ్లి బండి సంజయ్‌కుమార్‌ను కలువడం రాజకీయంగా పెద్దచర్చకు తెరతీసింది. బీఆర్ఎస్‌లోని పలువురు కార్పొరేటర్లు బీజేపీలో చేరడం ఖాయమని, సునీల్‌రావు కూడా అదే బాటలో ఉన్నారనే ప్రచారం జరుగుతోంది. అయితే నెల రోజులుగా పలు సందర్భాల్లో సునీల్‌రావు తాను బీఆర్ఎస్‌ను వీడేది లేదని, ఏ పార్టీలో కలిసేది లేదని ప్రకటించారు.

అయితే ఈసారి మాత్రం ఆయన పార్టీ మార్పు విషయం రాజకీయవర్గాల్లో చర్చకు తెరతీసింది. కార్పొరేషన్ ఎన్నికలు జరిగిన సమయంలో 60 మంది కార్పొరేటర్లకుగాను 39 మంది బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలుపొందారు. ముగ్గురు ఇండిపెం డెంట్లుగా గెలిచిన వారు ఆ వెనువెంటనే బీఆర్ఎస్‌లో చేరడంతో వారి సంఖ్య 42కు మారింది. ఎంఐఎం పార్టీకి చెందిన వారు ఏడుగురు, బీజేపీకి చెందిన వారు 11 మంది కూడా గెలుపొందారు. అయితే కాలక్రమేణ ఇద్దరు బీఆర్ఎస్ కార్పొరేటర్లు బీజేపీలో చేరగా, ముగ్గురు బీజేపీ కార్పొరేటర్లు బీఆర్ఎస్‌లో చేరారు. ఆ తర్వాత ఇటీవల 12 మంది కార్పొరేటర్లు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. దీనితో బీఆర్ఎస్ కార్పొరేటర్ల సంఖ్య ప్రస్తుతం 30కి పడిపోయింది. బీజేపీకి 11 మంది, కాంగ్రెస్‌కు 12 మంది, ఎంఐఎంకు 7గురు కార్పొరేటర్లు ఉన్నారు. ఇప్పుడు మరో ఐదుగురు కార్పొరేటర్లు బీజేపీలోకి, నాలుగు నుంచి ఐదుగురు కాంగ్రెస్‌కు చేరేందుకు ప్రయత్నాలు ప్రారంభించినట్లు సమాచారం. తాజాగా సునీల్‌రావు వ్యవహారం తెరపైకి రావడంతో ఆయన బీజేపీలో చేరడం ఖాయమే అయిన పక్షంలో బీఆర్ఎస్‌లో భారీ కుదుపు తప్పదని మెజార్టీ కార్పొరేటర్లు ఆయనతోపాటు బీజేపీలో చేరడం ఖాయమని భావిస్తున్నారు. ఈ వ్యవహారంలో సునీల్‌రావు వేసే అడుగులు కార్పొరేషన్‌లో బీఆర్ఎస్ పార్టీ భవితవ్యాన్ని నిర్ణయించనున్నాయి.

యోగాతో ప్రపంచ గుర్తింపు

● ప్రధాని మోదీ కృషితోనే యోగాకు అంతర్జాతీయ గుర్తింపు ● కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్



ఆసనాలు వేస్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్

కరీంనగర్ స్పోర్ట్స్, జూన్21: యోగాతో ప్రపంచ దేశాలకు భారతదేశం ఆరోగ్యాన్ని అందిస్తుందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని జ్యోతి నగర్ ఇంగ్లీష్ యూనియన్ మున్సిపల్ గ్రౌండ్‌లో శుక్రవారం ఉదయం నిర్వహించిన యోగా కార్యక్రమంలో కేంద్ర మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ కృషి వల్లె అంతర్జాతీయ యోగా దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. అన్ని రోగాలకు పరిష్కారంగా యోగా నిలుస్తుందని నిత్య జీవితంలో చిన్న పెద్ద తేడా లేకుండా అందరూ క్రమం తప్పకుండా యోగా చేయాలన్నారు. మన శ్రేయస్సుతో పాటు సమాజ శ్రేయస్సు అనే నినాదంతో ఈ సారి యోగా దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. అనంతరం వివిధ రకాల యోగాసనాలను మంత్రి యోగసాధకులతో కలిసి వేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌లు రాపర్తి విజయ, జితేందర్, కొలగాని శ్రీనివాస్, నాయకులు లక్ష్మారెడ్డి, ప్రవీణ్‌రావు పాల్గొన్నారు.

నాగర్ కర్నూల్ ఘటన సభ్య సమాజం సిగ్గుపడే చర్య

ఇల్లందకుంట : నాగర్ కర్నూల్ జిల్లాలో నిరుపేద చెంచు మహిళపై జరిగిన దారుణంపై సభ్య సమాజం సిగ్గు పడుతుందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. శుక్రవారం ఇల్లందకుంట మండల కేంద్రంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మహిళలపై దారుణానికి ఒడిగట్టిన నీచులను కఠినంగా శిక్షించాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో హుజూరాబాద్ నియోజకవర్గ ప్రజలు, కార్యకర్తలు కష్టపడి భారీ మెజార్టీ ఇచ్చినందుకు రెండు చేతులు జోడించి నమస్కారం చేశారు. బీఆర్ఎస్‌లో గుండాయిజం, కబ్జాలు చేసి నోళ్లను కాంగ్రెస్ పార్టీలోకి చేర్చుకుంటున్నారన్నారు. గతంలో కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలపై లాఠీచార్జీ చేసిన పోలీసులకు మళ్లీ పోస్టింగ్‌లు ఇవ్వడం సరి కాదన్నారు.రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా లేకుండా పోయాయన్నారు. సమావేశంలో మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, రావు పద్మ, మండలాధ్యక్షుడు తిరుపతిరెడ్డి, వైస్ ఎంపీపీ ఆరెల్లి జ్యోత్స్న, నాయకులు సురేందర్ రెడ్డి, రాజేందర్, మల్లేష్, రమేష్, సాంబయ్య, ఎల్లారెడ్డి, దేవేందర్, విజయ్, జడ్పీటీసీ శ్రీరాంశ్యామ్ ఉన్నారు.





వినతిపత్రం అందజేస్తున్న యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి మాదం తిరుపతి

ఫీజుల నియంత్రణ కమిటీలను ఏర్పాటు చేయాలి

కరింనగర్‌టౌన్, జూన్ 21: రాష్ట్ర వ్యాప్తంగా కార్పొరేట్ విద్యా సంస్థలు, ప్రైవేట్ విద్యాసంస్థలలో ఫీజుల దోపిడీపై ఫీజుల నియంత్రణ కమిటీ ఏర్పాటు చేయాలని భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్(యూఎస్ఎఫ్ఐ) తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో స్కూల్ బోర్డ్ అదనపు డైరెక్టర్ కె లింగయ్యకు వినతిపత్రం అంద జేశారు. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర కార్యదర్శి మాదం తిరుపతి మాట్లాడుతూ గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల విద్యాసంస్థలలో ఫీజుల దోపిడీపై స్పందించకుండా నిర్లక్ష్యం వహించారని దాని ఫలితంగా యజమాన్యాలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి సంవత్సరం 20 నుంచి 30శాతం ఫీజులు పెంచుకుంటూ విద్యార్థులను తల్లిదండ్రులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఫీజులను అరికట్టడం కోసం గత ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ఈ ప్రభుత్వమైనా తక్షణమే స్పందించి రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలలో ఫీజు రెగ్యులారిటీ కమిటీలను ఏర్పాటు చేయాలని కోరారు. తక్షణమే విద్యా వ్యాపారంపై రాష్ట్రవ్యాప్తంగా స్పందన రావాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో బోర్డ్ ముట్టడికి పిలుపునిస్తామని హెచ్చరించారు. ఈ వినతి పత్రం సమర్పించిన వారిలో రాష్ట్ర ఉపాధ్యక్షులు చెదలాపురం మధు, రాష్ట్ర నాయకులు బి వెంకట్, వికాస్, జయకృష్ణాలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ జయశంకర్‌కు ఘన నివాళి

సుభాష్‌నగర్, జూన్ 21: తెలంగాణ సిద్ధాంత కర్త ప్రొఫెసర్ జయశంకర్‌కు టీఎన్‌జీవో ఆధ్వర్యంలో ఘన నివాళులర్పించారు. ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి సందర్భంగా నగరంలోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు, ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా ఛైర్మెన్ దారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ ఉద్యమానికి తన జీవితాన్ని అంకితం చేశారని అన్నారు. 1969లో చేపట్టిన తెలంగాణ ఉద్యమంలో కూడా ఈయన పాల్గొన్నారని, నాన్ ముల్కి గోబ్యాక్, ఇడ్లీ సాంబార్ గోబ్యాక్ ఉద్యమంలో కూడా పాల్గొన్నారని తెలిపారు. ఆయన ఆశయాలను కొనసాగిద్దామన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సంఘం ఉపా ధ్యక్షుడు నాగుల నరసింహస్వామి, కార్యదర్శి గూడ ప్రభాకర్‌రెడ్డి, జిల్లా నాయ కుడు గంగారపు రమేశ్, పట్టణ అధ్యక్షుడు సర్దార్ హర్మీందర్‌సింగ్, రూరల్ అధ్యక్షుడు రాజేశ్ భరద్వాజ్, సుమంత్‌రావు, నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కోట రామస్వామి, కార్యదర్శి నర్సింహారెడ్డి, పవన్, శంకర్, డ్రైవర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సర్దార్ మంజిత్‌సింగ్ పాల్గొన్నారు.



ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహం వద్ద టీఎన్‌జీవో నాయకుల నివాళులు

24న క్రీడా పాఠశాలల ఎంపిక పోటీలు

కరీంనగర్ రూరల్, జూన్ 21: 2004-25వ విద్యా సంవ త్సరం 4వ తరగతికి క్రీడా పాఠశాలలో ప్రవేశం కోసం ఈ నెల 24వ తేదీన కరీంనగర్‌లోని అంబేడ్కర్ స్టేడియంలో కరీంనగర్ అర్బన్, రూరల్, కొత్తపల్లి మండలాల ఎంపిక పోటీలు నిర్వహించడం జరుగుతుందని మండల విద్యాధికారి మధుసూదనచారి తెలిపారు. ఈ క్రీడా పాఠశాలలో ప్రవేశానికి 3వ తరగతి పూర్తయి 4వ తరగతి చదువుతూ ఉండాలని, 1-9-2015 నుంచి 31-08-2016 మధ్య జన్మించి ఉండాలని తెలిపారు.

ఎంపిక కోసం ఆధార్ కార్డు జిరాక్స్ జనన ధ్రువీకరణ, స్కూల్ స్టడీ సర్టిఫికెట్, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు జనన ధ్రువీకరణ పత్రం గ్రామ పంచాయతీ లేదా మున్సిపాలిటీ నుంచి తీసుకురావాలని తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే విద్యార్థులు అర్హత ధ్రువ పత్రాలతో అంబేడ్కర్ స్టేడియంలో ఉదయం 9గంటల వరకు హాజరు కావాలని తెలిపారు. ఎంపిక పోటీలల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జిల్లా స్థాయికి పంపించడం జరగుతుందని తెలిపారు. వివరాలకు భాషబోయిన వేపిడి 9396404896, మండలాల వారీగా కరీంనగర్ అర్బన్ పీడీ శంకరయ్య 9849114956, కరీంనగర్ రూరల్ మండలం యం రమేష్ పీడీ 9948749948, కొత్తపల్లి మండలం గిన్నె లక్ష్మణ్ పీడీ 8099546565 నంబర్‌లలో సంప్రదించాలని కోరారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

గంగాధర, జూన్ 21: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ గంగాధర మండలం లక్ష్మీదేవిపల్లికి చెందిన జలెందర్(33) అనే యువకుడు చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. గురువారం రాత్రి జలెందర్ బోయినపల్లి మండలం కొదురుపాక బ్రిడ్జి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల సమాచారం మేరకు కుటుంబ సభ్యులు కరీంనగర్‌కు తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. జలెందర్ ఉపాధి నిమిత్తం దుబాయి వెళ్లి రెండు నెలల క్రితం వచ్చాడు. సోమవారం తిరిగి దుబాయి వెళ్లేందుకు విమాన టికెట్టు సైతం బుక్ చేసుకున్నాడని కుటుంబీకులు తెలిపారు. ఇంతలోనే రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

మంథని, జూన్ 21: స్థానిక పోచమ్మవాడలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో బుద్దార్తి వర్షిత్(18) యువకుడు శుక్రవారం మృతిచెందినట్లు ఎస్ఐ వెంకటకృష్ణ తెలిపారు. తన ఇంటి ముందు నిర్మించిన మరో ఇంటిలో విద్యుత్ వర్క్ చేస్తుండగా ప్రమాదవశాత్తు షాక్‌కు గురయ్యాడు. వర్షిత్‌ను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్ ధ్రువీకరించారు. తండ్రి బుద్దార్తి నవీన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

ఎఫ్‌సీఐ బియ్యం బస్తాలు దొంగిలించిన ముఠా అరెస్టు

అంతర్గాం, జూన్ 21: మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో ఆగి ఉన్న ఎఫ్‌సీఐ బియ్యం బస్తాల గూడ్స్ రైలు నుంచి 30క్వింటాళ్ల బియ్యం బస్తాలు దొంగిలించి రెండు ఆటోలలో తరలిస్తున్న నలుగురు నిందితులను శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపుతున్నట్టు రామగుండం ఆర్‌పీఎఫ్ సీఐ బుర్ర సురేష్‌గౌడ్ తెలిపారు. నిందితులు గుమ్ముల భీమయ్య, జనగామ దినేష్, కనుసోతు వెంకటేష్, అన్నెల వంశీలను మంచిర్యాల పట్టణంలో పట్టుకుని వీరితో పాటు రెండు ఆటోలు టీఎస్01యూబీ7552, టీఎస్19టీఏ6109లను అదుపులోకి తీసుకున్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌పీఎఫ్ ఏఎస్ఐ శేఖర్‌రెడ్డి, డీ ఐలయ్య, సుమన్, ఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్టీపీసీలో వ్యక్తి ఆత్మహత్య


రమేశ్(ఫైల్)

జ్యోతినగర్, జూన్ 21: ఎన్టీపీసీ అన్నపూర్ణకాలనీలో శుక్రవారం కందుల రమేశ్(53) అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంటి దూలానికి తాడుతో ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. కుటుంబ కలహాల కారణంగా రమేష్ ఆత్మహత్యకు పాల్పడి నట్లు ఎన్టీపీసీ పోలీసులు తెలిపారు. రమేశ్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు, కొడుకు ఉన్నారు. కొడుకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎన్టీపీసీ పోలీసులు తెలిపారు.

యూనిసెఫ్ ప్రతినిధుల సందర్శన



తిమ్మాపూర్‌లో ఇంకుడు గుంతలను పరిశీలిస్తున్న యూనిసెఫ్ ప్రతినిధులు

తిమ్మాపూర్, జూన్ 21: తిమ్మాపూర్ గ్రామాన్ని కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మూడు రా˘ రాష్ట్రాల యూనిసెఫ్ ప్రతినిధులు(40మంది) శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో బృదం సభ్యులు పర్యటించి పారిశుధ్యం, తాగునీరు సదుపాయాలను పరిశీలించారు. ఇళ్లల్లో తడి, పొడి చెత్త సేకరణ, వేరుచేయడం, కంపోస్ట్ తయారు చేయడం, దాన్ని అమ్మకం లాంటి వాటిని పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో నల్ల కనెక్షన్‌లు, ఇంకు డు గుంతలు, కిచెన్ గార్డెన్‌లు, టాయిలెట్లు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను, మండల వైద్య కేంద్రాన్ని పరిశీలించారు. వాటి పనితీరును అడిగి తెలుసుకున్నారు. గ్రామ పంచాయతీలో కంపోస్ట్ స్టాల్, స్టీల్ బ్యాంక్, శానిటరీ టూల్స్ స్టాల్, వాటర్ టెస్టింగ్, పారిశుధ్య కార్మికుల సేఫ్టీ స్టాల్, గ్రామ పంచాయతీకి వచ్చిన అవార్డులతో ఏర్పాటు చేసిన స్టాల్‌లను పరిశీలించారు. పారిశుధ్య కార్మికులకు ఇన్సూరెన్స్, పీపీఈ కిట్స్, హెల్త్ చెకప్స్‌ను పరిశీలించారు. అనంతరం సమావేశం ఏర్పాటు చేసి గ్రామంలో చేపడుతున్న అభివృద్ధి పనులు బాగున్నాయని ప్రశం సించారు. కార్యక్రమంలో యూనిసెఫ్ హెచ్‌యఫ్‌వో వెంకటేష్, వాష్ కన్సల్‌టెంట్ ప్రభాత్, ఇఫి కర్ కన్సల్‌టెంట్ కాశీనాథ్, కన్సల్‌టెంట్‌లు, జిల్లా యూనిసెఫ్ కో ఆర్డినేటర్ కిషన్‌స్వామి, ఎస్ బీఎం రమేశ్, వేణు, ఎంపీడీవో విజయ్‌కుమార్, ఎంపీవో కిరణ్ కుమార్, గ్రామ పంచాయతీ కార్యదర్శి కె.మహేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కళాకారులను ప్రోత్సహించాలి



జ్యోతి వెలిగిస్తున్న ఆర్డీవో మహేశ్వర్

- సంగీత దినోత్సవంలో ఆర్డీవో మహేశ్వర్
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

కరీంనగర్ కల్చరల్, జూన్ 21: కళలు అజరామరమని, కళలను, కళాకారులను ప్రోత్సహిం చాల్సిన అవసరం ఉందని ఆర్డీవో మహేశ్వర్ అన్నారు. శుక్రవారం ప్రపంచ సంగీత దినోత్సవం సందర్భంగా కరీంనగర్ లోని ఫిలిం భవన్‌లో ప్రవీణ్ సల్వాజి మ్యూజికల్ గ్రూప్, సల్వాజి ఈవెంట్స్ సంయుక్తంగా నిర్వహించిన వేడుకకు ఆర్డీవో ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. భారతీయ కళలకు ఎంతో ప్రాధాన్యం ఉందని తెలిపారు. కళాకారులకు, కళలకు చేయూతని వ్వాలని, కళలతో మానసిక, శారీరక ప్రశాంతత సాధ్యమని తెలిపారు. ప్రతీ యేటా సంగీత దినోత్సవాన్ని జరుపుతూ కళాకారులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి అందరికీ పరిచయం చేస్తోన్న సల్వాజి ప్రవీణ్‌ను అభినందించారు.



నృత్యం చేస్తున్న చిన్నారులు

సీనియర్ గాయకులు నామ్‌దేవ్, బొజ్జ రేవతి, గొల్లపల్లి రవీందర్, మురళి మధు, టి మోహనస్వామి, జి కృపాదానంతో పాటు సుమారు 10 జిల్లాల నుంచి వచ్చిన కళాకారులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీనియర్ గాయ కుల పాటలతో పాటు సంగెం రాధాకృష్ణ బృందం, చిన్నారుల శాస్త్రీయ నృత్యాలు, రామకృష్ణ బృందం, విద్యార్థుల బ్రేక్ డాన్స్‌లు ఎంతగానో అలరించాయి. కార్యక్రమంలో ప్రొఫెసర్ తిరుపత య్య, అజయ్, గుండేటి రమేశ్, అనుముల దయాకర్, అభి, బాబు గౌరవేని, సల్వాజి సంధ్య, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

25 శాతం పెనాల్టీ జీవోను రద్దు చేయాలి



మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న బాధితులు

కరీంనగర్ టౌన్, జూన్ 21: వానాకాలం 2021-22కు సంబం దించిన రైస్ సీఎంఆర్ నిర్ణీత కాల వ్యవధిలో ఇవ్వనందున 25శాతం పెనాల్టీ విధిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోను రద్దు చేసి న్యాయం చేయాలని కరీంనగర్ రా రైస్ మిల్లర్స్, 25 శాతం పెనాల్టీ బాధితులు రాష్ట్ర పౌరసరఫరాలు, భారీ నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు పలువురు బాధితులు హైదరాబాద్‌లో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. 2021-22 వానాకాలం సీజన్‌లో సివిల్ సప్లయిశాఖ నుంచి ధాన్యాన్ని దించుకొని నిర్ణీత కాలవ్యవధిలో రైస్ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ గోదాములు ఖాళీగా లేక పోవడంతో అధికారుల దృష్టికి సమస్యలను పలుమార్లు తీసుకెళ్లి విన్నవించుకున్నామని చెప్పారు. తమకు రైస్ డెలివరీ చేసేందుకు అలాట్‌మెంట్ ఇవ్వాల్సిందిగా చాలా సార్లు కోరినప్పటికీ వివిధ కారణాలను చూపుతూ అలాట్‌మెంట్ ఇవ్వలేదని అన్నారు. 2021 సంవత్సరానికి సం బంధించిన ధాన్యం ఉత్పత్తి ఎక్కువైనందున గోదాములు పూర్తిగా నిండిపోయినప్పటికీ కూడా అధికారుల ఒత్తిడి మేరకు మిల్లు ఆవరణ లోని ఖాళీ స్థలంలో ధాన్యం బలవంతంగా దించారని మంత్రికి వివరించారు. ఆ ధాన్యాన్ని కాపాడేందుకు సరైన రక్షణ చర్యలు చేపట్టినా కూడా ప్రభుత్వం నిర్ణీత కాలవ్యవధిలో బియ్యం తీసుకోకపో వడంతో ప్రకృతి వైపరీత్యాలతో కురిసిన భారీ వర్షాలకు ధాన్యం దెబ్బతిని నల్లరంగుగా మారి మొలకెత్తాయన్నారు. వానాకాలం ధాన్యం ఉండగానే యాసంగి ధాన్యం కూడా దిగుమతి చేశారని అన్నారు. ఇలా అనేక రకాలుగా రా రైస్ మిల్లర్లు ఇబ్బందులకు గురికావడమే కాకుండా నష్టపోయామని, సంస్థకు 100శాతం బియ్యం ఇచ్చినా కూడా పెనాల్టీ చెల్లించాలని జిల్లా అధికారులు మౌఖిక ఆదేశాలు జారీ చేస్తూ పెనాల్టీ చెల్లిస్తేనే 2024 వానాకాలం ధాన్యం అలాట్‌మెంట్ జారీ చేస్తామంటున్నారని పేర్కొన్నారు. పెనాల్టీ తో రోడ్డున పడతామని, 25 శాతం పెనాల్టీని రద్దు చేయాలని మంత్రి ద్వారా ప్రభుత్వాన్ని కోరారు.

స్వగ్రామానికి చేరిన వలస జీవి మృతదేహం



చంద్రయ్య(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, జూన్ 21: ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్ గ్రామానికి చెందిన శీతాల చంద్రయ్య(55) మాల్దీవుల దేశంలో ఈ నెల 17న ప్రమాదవశాత్తు మృతి చెందడంతో ఆయన మృతదేహం శుక్రవారం ఇల్లు చేరింది. కుటుంబ పెద్ద విగత జీవిగా శవ పేటికలో చేరుకోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా రోధించారు. కుటుంబ సభ్యులు, స్థానికుల కథనం మేరకు.. గ్రామంలోని చంద్రయ్య ఉన్న ఊరిలో ఉపాధి లేక గత 20 ఏళ్లుగా ముంబాయికి వలస వెళ్లాడు. అక్కడ అఫ్గాన్ కంపెనీలో పనులు చేస్తు జీవిస్తుండేవాడు. ఈ క్రమంలో అదే కంపెనీ మాల్దీవుల దేశంలో వంతెన నిర్మాణ పనులను చేపడుతోంది. దాంతో రెండేళ్ల కిందట చంద్రయ్య మాల్దీవుల దేశానికి వెళ్లాడు. నెల రోజుల కిందట అతని సోదరుడు నర్సయ్య అనారోగ్యంతో చనిపోయాడు. స్వగ్రామానికి వచ్చిన చంద్రయ్య అంత్యక్రియలు నిర్వహించి 15 రోజుల పాటు ఉండి తిరిగి పయనమయ్యాడు. ఈ నెల 17న వంతెన పనులు చేస్తున్న క్రమంలో రెండు క్రేన్ల మధ్య చిక్కుకుని చనిపోయాడు. నాలుగు రోజులకు చంద్రయ్య మృతదేహం ఇల్లు చేరడంతో కుటుంబ సభ్యుల రోధనలు మిన్నంటాయి. నెల రోజుల వ్యవధిలోనే ఇద్దరు అన్నదమ్ములు చనిపోవడంతో ఆ కుటుంబంలో విషాదం అలుముకుంది. మృతుడికి భార్య పోశవ్వ, వివాహమైన కూతురు భాగ్యలక్ష్మీలు ఉన్నారు. కాగా బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరారు.

ఆర్థిక ఇబ్బందులతో రైల్వే ఉద్యోగి ఆత్మహత్య



సీవీ శ్రీనివాస్(ఫైల్)

అంతర్గాం, జూన్ 21: రామగుండం పట్టణంలోని రైల్వేకాలనీకి చెందిన రైల్వే ఉద్యోగి సీవీ శ్రీనివాస్ ఆర్థిక ఇబ్బందులతో శుక్రవారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రామగుండం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సీవీ శ్రీనివాస్ 30ఏళ్లుగా రామగుండం రైల్వే సీఅండ్‌డబ్ల్యూ డిపోలో పని చేస్తున్నాడు. పిల్లల ఉన్నత చదువుల కోసం అప్పులు చేసిన శ్రీనివాస్ ఇటీవల కాలంలో ఆర్థిక ఇబ్బందులతో సతమతవుతున్నాడు. దీంతో మనస్తాపం చెంది ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సీవీ శ్రీనివాస్ గతంలో వివిధ పత్రికలకు కథనాలను కూడా రాశారు. ఈ నేపథ్యంలో శ్రీనివాస్ మృతి వార్త తెలిసిన పలువురు పాత్రికేయులు మృతదేహానికి నివాళులర్పించారు. సీవీ శ్రీనివాస్‌కు భార్య అరుణ, కుమారుడు, కూతురు ఉన్నారు. మృతదేహానికి పంచనామా నిర్వహించిన రామగుండం ఎస్‌ఐ సతీష్ కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

ఇసుక అక్రమ నిల్వలపై దాడులు

- స్వాధీనం చేసుకున్న అధికారులు
- టెండర్ నిర్వహిస్తామని వెల్లడి

కోరుట్ల, జూన్ 21: మండలంలోని నాగులపేట గ్రామంలో అక్రమ నిలువలపై మైనింగ్, రెవెన్యూ అధికారులు దాడులు నిర్వహించారు. గ్రామ శివారులోని వ్యవసాయ క్షేత్రాలు, మామిడి తోటలతో పాటు గ్రామంలోని పలు చోట్ల ఉన్న అక్రమ ఇసుక నిలువలను గుర్తించిన అధికారులు వాటిని స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలోని వివిధ ప్రాంతాలలో 168 ఇసుక కుప్పలు ఉన్నట్లు గుర్తించారు. గ్రామం నుంచి కోరుట్ల పట్టణంతో పాటు మండలంలోని వివిధ గ్రామాలకు ఈ గ్రామం నుంచి భారీగా అక్రమంగా ఇసుక తరలిస్తుంటారు. ఇసుక నిలువలు ఉన్నట్లు మైనింగ్ అధికారులకు పిర్యాదు చేయగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మైనింగ్ అధికారి తిరుపతి రావు ఆధ్వర్యంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజేందర్‌రావు పోలీసుల సహాయంతో దాడులు చేశారు. త్వరలో ఇసుకను టెండర్ వేయనున్నట్లు అధికారులు తెలిపారు.



అక్రమంగా నిల్వ చేసిన ఇసుక

పోగొట్టుకున్న బంగారు ఆభరణాలు అప్పగింత



తోట లక్ష్మికి బంగారు ఆభరణాలు అప్పగిస్తున్న డీఎం నాగభూషణం

కళ్యాణ్‌నగర్, జూన్ 21: గోదావరిఖని బస్‌లో ఈనెల 19న బంగారు ఆభరణాలు మరిచిపోయిన ప్రయాణికురాలు తోట లక్ష్మికి రూ.7లక్షల విలువైన బంగారు ఆభరణాలను శుక్రవారం ఆర్‌టీసీ డీఎం నాగభూషణం డిపోలో అప్పగించారు. గోదావరిఖని డిపోకు చెందిన టీజీ22జెడ్ 0013 ఎక్స్‌ప్రెస్ బస్సు సికింద్రాబాద్ నుంచి గోదావరిఖనికి వస్తుండగా సుల్తానాబాద్ వద్ద బస్సులో ఒక చేతి సంచిని గమనించిన కండక్టర్ శ్రీనివాస్ అందులో బంగారు ఆభరణాలు ఉన్నట్టు గుర్తించి డిపోకు వచ్చిన తరువాత అధికారులకు అప్పటించారు. రూ.7లక్షల విలువ చేసే 89గ్రాముల బంగారాన్ని ఓదెల మండలం కొలనూరు గ్రామానికి చెందిన తోట లక్ష్మి అనే ప్రయాణీకురాలివి గుర్తించారు. తగిన ఆధారాలతో డిపో అధికారులను సంప్రదించగా తిరిగి ఆ బంగారు ఆభరణాలు తోట లక్ష్మికి డీఎం నాగభూషణం అప్పగించారు. నిజాయితీగా ఆభరణాలు అప్పగించిన కండక్టర్ శ్రీనివాస్‌ను లక్ష్మి కుటుంబ సభ్యులు, తోటి కండక్టర్లు, డ్రైవర్లు అభినందించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ గీత కృష్ణ, డిప్యూటీ సూపరింటెండెంట్ సదానందం, సెక్యూరిటీ సిబ్బంది సత్యనారాయణ, అఖిల తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు పత్రాలతో భూ కబ్జా

- ఐదుగురిపై కేసు నమోదు
- ఆలస్యంగా వెలుగుచూసిన ఘటన

రాయికల్, జూన్ 21: రాయికల్ పట్టణంలో తప్పుడు పత్రాలతో భూమిని కబ్జా చేసిన ఐదుగురిపై కేసు నమోదైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రాయికల్ మండలం వస్తాపూర్ గ్రామానికి చెందిన అనుపట్ల శ్రీనివాస్, అనుపట్ల పోచయ్యలు అన్నద మ్ములు కాగా, శ్రీనివాస్‌కు కుమారుడు ప్రశాంత్, భార్య లక్ష్మి ఉన్నారు. పోచయ్యకు సంతానం లేకపోవడంతో మేన కోడలు బూర్గుల శారదను పెంచుకున్నాడు. శ్రీనివాస్ 2010 లో రాయికల్ పట్టణంలో సర్వే నెం.1057/ఇ లో 637 చదరపు గజాల భూమిని కొనుగోలు చేశాడు. 2010, డిసెంబరు 10న అనారోగ్యంతో శ్రీనివాస్ మృతి చెందగా, అప్పటి నుంచి లక్ష్మి, తన కుమారుడు ప్రశాంత్‌తో కలిసి కొడిమ్యాల మండలం పూడూర్‌లో నివాసముం టుంది. కొన్ని సంవత్సరాలుగా శ్రీనివాస్ కుటుంబసభ్యులు రాయికల్‌కు రాకపోవడంతో భూ మిని సొంతం చేసుకోవాలని బూర్గుల శారద మరికొందరి సహకారంతో 2017లో జగిత్యాల మున్సిపాలిటీ నుంచి లక్ష్మి మృతి చెందినట్లు మరణ ధృవీకరణ పత్రం రాయికల్ తహసీ ల్దార్ కార్యాలయం నుంచి జారీ చేసినట్లు శ్రీనివాస్ వారసురాలిగా శారద అని తప్పుడు కు టుంబసభ్యుల ధృవీకరణ పత్రాలు సృష్టించారు. ఈ ఆధారాలతో జనవరి 5, 2024న డాక్యు మెంట్ నెం.106/2024, 107/2024 కట్కం సాయి కుమార్, అనుపట్ల పోచమ్మలకు రిజిస్ట్రేష న్ చేశారు. మారంపల్లి రవి కుమార్, పడిగెల నర్సింహా సాక్ష్యులుగా సంతకాలు చేశారు. ఈ పత్రాలతో భూమిని కబ్జా చేశారు. విషయం తెలుసుకున్న అనుపట్ల శ్రీనివాస్, భార్య లక్ష్మి, కుమారుడు ప్రశాంత్ తమ భూమి కబ్జాకు గురైందని ఆధారాలు సేకరించి రాయికల్ పోలీ స్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, బూర్గుల శారద, అనుపట్ల పోచమ్మ, కట్కం సాయి కుమార్, మారంపెల్లి రవి కుమార్, పడిగెల నర్సింహా అనే ఐదుగురు వ్యక్తులపై ఈ నెల 8న కేసు నమోదైంది. తమ భూమిని తప్పుడు పత్రాలు సృష్టించి రిజిస్ట్రేషన్ చేసుకున్నవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు

భూ తగాదాలతో వ్యక్తి ఆత్మహత్య

ఇల్లంతకుంట, జూన్ 21: మండలంలోని తిప్పాపూర్ గ్రామంలో భూ తగాదాతో గంద్ర నర్సింగరావు (65) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల ప్రకారం.. నర్సింగరావుకు తన అన్న గంద్ర సూర్యారావు, బోయినిపల్లి నర్సింగరావుకు మధ్య భూతగాదా ఏర్పడింది. సమస్య పరిష్కారం కాకపోవడంతో మనస్తాపం చెందాడు. బుధవారం ఇంట్లో పరుగుల మంది తాగి అపస్మారకస్థితికి చేరుకోగా ఎల్లారెడ్డిపేటలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతూ గురువారం అర్ధరాత్రి మృతిచెందాడు. బంధువుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిరిసిల్ల రూరల్ సీఐ సదన్‌కుమార్, ఎస్సై రాజుగౌడ్ తెలిపారు.

దాడి ఘటనలో ముగ్గురిపై కేసు

ఎల్లారెడ్డిపేట, జూన్21: దాడి ఘటనలో ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన చింతకింది భాను, నిఖిల్, మరో యువకుడిపై కేసు నమోదు చేశామని స్టేషన్ హౌస్ అధికారి కిషన్‌రావు శుక్రవారం తెలిపారు. మండల కేంద్రంలోని కులేరి దీప్తి కుమార్ తన ఇంటికి వెళ్తున్న దారిలో ముగ్గురు యువకులు మూత్ర విసర్జన చేశారని పేర్కొన్నారు. దారిలో మూత్ర విసర్జన చేస్తే ఎలా అని ప్రశ్నించినందుకు దీప్తి కుమార్‌పై భాను, నిఖిల్, మరో యువకుడు దాడి చేశారని చెప్పారు. అక్కడే ఉన్న బీరు సీసాతో కొట్టి చంపి వేస్తామని హెచ్చరించినట్లు పేర్కొన్నారు. బాధితుడు దీప్తి కుమార్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ గీత కార్మికుడు మృతి

ముస్తాబాద్, జూన్ 21: ముస్తాబాద్ మండలం చిప్పల్లపల్లికి చెందిన కంచర్ల దేవయ్యగౌడ్ తాటి చెట్టు పైనుంచి పడి తీవ్రగాయాలకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. గ్రామానికి చెందిన దేవయ్యగౌడ్ కులవృత్తి చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఫిబ్రవరి 28వ తేదీన వృత్తిలో భాగంగానే తాటి చెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా మోకు తెగిపోవడంతో కింద పడి తీవ్రగాయాలకు గురయ్యారు. గమనించిన కార్మికులు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ నాలుగు నెలల తరువాత మృతి చెందాడు.

జిల్లా వ్యాప్తంగా నాకా బందీ

- అసాంఘిక శక్తుల కట్టడే ధ్యేయం
- ఎస్పీ అఖిల్ మహాజన్



సిరిసిల్లలో వాహనాలు తనిఖీచేస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, జూన్ 21: శాంతిభద్రతల పర్యవేక్షణలో భాగంగా జిల్లా వ్యాప్తంగా పోలీసులు నాకాబందీ నిర్వహించారు. అసాంఘిక శక్తులు, అనుమానిత వ్యక్తులను కట్టడిచేసేందుకే జిల్లా వ్యాప్తంగా విస్తృత తనిఖీలు చేపట్టామని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. శుక్రవారం సాయంత్రం సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్‌చౌరస్తా, రగుడు చౌరస్తాలో ఎస్పీ అఖిల్ మహాజన్ వాహనాలను తనిఖీ చేశారు. జిల్లాలోకి వచ్చే అన్ని దారులలోనూ, మండల కేంద్రాల్లోనూ పోలీసు అధికారులు, సిబ్బంది ఏకకాలంలో ముమ్మర తనిఖీలు చేపట్టారు. ధ్రువపత్రాలు, నంబర్లు ప్లేట్లు లేని వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు తనిఖీలు నిర్వహించామన్నారు. ప్రజల్లో భద్రతా భావాన్ని కల్పించడమే లక్ష్యమన్నారు. జిల్లాలో ఎవరైనా అనమానాస్పదంగా తిరిగితే డయల్ 100కు లేదా సమీపంలో ఉన్న పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, సిరిసిల్ల రూరల్ సీఐ సదన్‌కుమార్ పాల్గొన్నారు.

బావిలో పడి కూలీ మృతి

ధర్మపురి, జూన్ 21: మండలంలోని దమ్మన్నపేట గ్రామంలో శివరాత్రి మహేష్(25) అనే కూలీ వ్యవసాయ బావిలో పడి శుక్రవారం మృతి చెందాడు. గ్రామంలో జక్కుల రాజన్న అనే వ్యక్తి వ్యవసాయ బావి చుట్టూ తెట్టె కట్టే కూలి పనికి మహేస్ వెళ్లాడు. ప్రమాదవశాత్తు కాలు జారి బావిలో పడగా ఈత రాకపోవడంతో నీటిలో మునిగి మృతి చెందాడు. మృతుడి తండ్రి శివరాత్రి ఎల్లయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఉదయ్‌కుమార్ తెలిపారు.

దొంగల బీభత్సం

తంగళ్లపల్లి, జూన్ 21: దేశాయపల్లె మల్లాపూ ర్‌లో శుక్రవారం తెల్లవారుజామున దొంగలు బీభత్సం సృష్టించారు. మల్లాపూర్‌లో ఇంటి ఆవరణలో నిద్రిస్తున్న బాస ఎల్లవ్వ మెడలో మూ డు తులాల పుస్తెల తాడు ఎత్తుకెళ్లారు. అదే గ్రామానికి చెందిన తాటిపల్లి బాలకిషన్, ఎడ్ల రమేష్‌కు చెందిన రెండు సెల్ ఫోన్లు దొంగి లించారు. దేశాయిపల్లెకి చెందిన పర్శరాములు ఇంటి తాళం పగలగొట్టి రూ.4 వేల ఎత్తుకెళ్లారు. డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, ఎస్సై సుధాకర్ సంఘటన స్థలాలను పరిశీలించారు.

పీహెచ్‌డీ నోటిఫికేషన్ విడుదల చేయాలి

గణేశ్‌నగర్, జూన్ 21: పీహెచ్‌డీ నోటిఫికేషన్ విడుదల చేయాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) శాతవాహన యూనివర్సిటీ శాఖ ఆధ్వర్యంలో ఎస్‌యూ రిజిస్ట్రార్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వర్కింగ్ కమిటీ మెంబర్ జెల్లపల్లి అంజన్న మాట్లాడుతూ పీహెచ్‌డీ నోటిఫికేషన్ ఇవ్వని కారణంగా ఎంతో మంది విద్యార్థులు చదువులకు దూరం అవుతున్నారని అన్నారు. వెంటనే పీహెచ్‌డీ నోటిఫికేషన్ ఇవ్వాలన్నారు. యూజీసీ నెట్, సెట్, జేఆర్‌ఎఫ్, అర్హత సాధించిన విద్యార్థులు ఎంతోమంది నోటిఫికేషన్ లేక కూలి పనులు చేసు కుంటున్నారని దీని వెంటనే గ్రహించి నోటిఫికేషన్ వచ్చేలాగా చొరవ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా కన్వీనర్ విష్ణు, పీజీ విద్యార్థులు మహేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్‌యూ రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏబీవీపీ నాయకులు

రూ.7,350 పలికిన పత్తి ధర

జమ్మికుంట, జూన్ 21: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 7,350 రూపాయలు పలికింది. శుక్రవారం మార్కెట్ యార్డుకు 22మంది రైతులు 338క్వింటాళ్ల విడి పత్తి, నలుగురు రైతులు నాలుగు క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర 7,350, కనిష్ఠ ధర 6,500 రూపాయలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

ఇల్లందకుంట ఆలయ అభివృద్ధికి కృషి



కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కు స్వాగతం పలుకుతున్న అర్చకులు

ఇల్లందకుంట, జూన్ 21: శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయంలో కేంద్రం సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ మండపంలో స్వామివారి ఆశీర్వచనం అందించి, చిత్రపటాన్ని ఆలయ ఈవో సుధాకర్ బహూకరించారు. అంతకు ముందు బండి సంజయ్‌కుమార్‌కు మండలాధ్యక్షుడు తిరుపతి రెడ్డి స్వాగతం పలికారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, రావు పద్మ, మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి, నాయకులు సురేందర్‌రెడ్డి, పవన్, ఆరెల్లి జ్యోత్స్న, శ్రీరామ్‌శ్యామ్, రాజేందర్, మల్లేష్, శ్రీనివాస్, సాంబయ్య, షఫీ, ఎల్లారెడ్డి, సుధాకర్‌రెడ్డి, సాయిరెడ్డి సంపత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రికి ఘన స్వాగతం

హుజూరాబాద్, జూన్ 21: కరీంనగర్ ఎంపీ, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు హుజూరాబాద్‌లో శుక్రవారం స్థానిక బీజేపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మహిళలు మంగళహారతులతో మహిళలు గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి గంగిశెట్టి రాజు, గౌతమ్‌రెడ్డి, శశిధర్, పోతుల సంజీవ్, పుప్పాల రఘు, ప్రభాకర్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

జమ్మికుంట రూరల్: కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి హోదాలో మొదటి సారి జమ్మికుంట పట్టణానికి వచ్చిన బండి సంజయ్‌కుమార్‌కు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. కార్యక్రమంలో సరిమల్ల జయేందర్, ఎలిమిల్ల రాజేంద్రప్రసాద్, వొల్లాల దామోదర్, పత్తి జనార్ధన్‌రెడ్డి, తిరుపతి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

శంకరపట్నం: కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన బండి సంజయ్‌కుమార్ శుక్రవారం శంకరపట్నం మండలం తాడికల్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన భవనం ప్రారంభోత్సవానికి రాగా మండల ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ ఛైర్మన్ మధుకర్‌రెడ్డి ఆధ్వర్యంలో పురోహితులు బండి సంజయ్‌కుమార్‌కు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం కొత్తగట్టు గుట్టపై వెలసిన శ్రీమత్స్యగిరీంద్రస్వామిని దర్శిం చుకోవడానికి వెళ్లారు. లింగాపూర్ వడ్రంగి చేసిన హలమును (నాగలి) మల్లారెడ్డి బండి సంజయ్‌కుమార్‌కు బహూకరించారు. కార్యక్రమంలో అధికారులు, బీజేపీ శ్రేణులు, ప్రజలు పాల్గొన్నారు.

మానకొండూర్: కేంద్ర హోం శాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ నియోజకవర్గ పర్యటనలో భాగంగా శుక్రవారం మానకొండూర్‌లో బీజేపీ మండలశాఖ ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. పల్లెమీద బస్టాండ్ వద్ద క్రేన్ సహాయంతో గజమాలను మంత్రికి వేసి సన్మానించారు. అనంతరం గట్టుదుద్దెనపల్లిలోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో బండిసంజయ్ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు గుర్రాల వెంకట్‌రెడ్డి, రంగు భాస్కరాచారి, రాపాక ప్రవీణ్, కత్తి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయానికి ప్రాధాన్యం ఇవ్వాలి

భగత్‌నగర్, జూన్21: సేంద్రియ వ్యవసాయానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఆర్డీవో కుందారపు మహేశ్వర్ రైతులకు సూచించారు. శుక్రవారం కొత్తపల్లి మండలం చింతకుంటలో రైతు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏరువాక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. రసాయన ఎరువుల పైననే ఎక్కువగా ఆధారపడడం దురదృష్టకరమన్నారు. ఆ పరిస్థితి పోయి మళ్లీ సేంద్రియ వ్యవసాయం వైపు అడుగులు వేయాలని రైతులకు పిలుపునిచ్చారు. జిన్నా సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ రైతులందరూ పూర్వం మాదిరిగా పాడిని పెంచాలని వాటి ద్వారా వచ్చే ఎరువులను పంట పొలాలకు ఉపయోగించాలని సూచించారు. గ్రామభారతి రాష్ట్ర అధ్యక్షుడు, ఆదర్శ రైతు ఉత్పత్తి సంస్థ ఎండీ న్యాలమడుగు శంకరయ్య మాట్లాడుతూ గోసంపద వృద్ధి చెందితే పంట దిగుబడి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ రిసెర్చ్ స్టేషన్ డైరెక్టర్ మంజులత, విజ్ఞాన కేంద్రం జమ్మికుంట శాస్త్రవేత్త వెంకటేశ్వర్, మన ఆదర్శ రైతు ఉత్పత్తి సంస్థ డైరెక్టర్లు, చింతకుంట సంఘ డైరెక్టర్‌లు పాల్గొన్నారు.

పంటకు మద్దతు ధర పెంపుపై హర్షం

భగత్‌నగర్, జూన్ 21: కేంద్ర ప్రభుత్వం 14పంటలకు కనీస మద్దతు ధర పెంచడంపై కొత్తపల్లి మండలం మల్కాపూర్ గ్రామ రైతు సేవా సమితి అధ్యక్షుడు నరహరి లక్ష్మారెడ్డి ప్రధాని నరేంద్రమోదీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రైతులకు అనేక హామీలు ఇచ్చి అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ రైతుబంధుపై, రైతు రుణామాఫీ పై రోజుకు ఒక మాట మాట్లాడుతూ రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైందని తెలిపారు. ఇప్పటికైనా ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు.

కేంద్ర మంత్రి 'బండి'ని కలిసిన బీఆర్ఎస్ కార్పొరేటర్లు

కరీంనగర్ టౌన్, జూన్ 21: కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్‌ను నగరంలోని ఆయన నివాసంలో పలువురు బీఆర్ఎస్ కార్పొరేటర్లు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం కార్పొరేటర్లు గందె మాధవిమహేశ్, జంగిలి ఐలేందర్‌యాదవ్, ఎడ్ల అశోక్, కచ్చు రవితోపాటు వివిధ పార్టీల నాయకులు, ప్రతినిధులు కేంద్రమంత్రిని కలిసి పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. కార్పొరేటర్ స్థాయి నుంచి కేంద్రమంత్రిగా ఎదుగడం ఆనందంగా ఉందని కార్పొరేటర్లు అన్నారు. రాంపూర్‌లోని డంపింగ్‌యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలని ఐలేందర్‌యాదవ్ కోరారు. కిసాన్ నగర్‌లోని దేవాలయాలను సందర్శించాలని ఎడ్ల అశోక్ మంత్రిని ఆహ్వానించారు.

జర్నలిస్టుల సమస్యలపై పోరాటం



బుర్ర సంపత్‌కుమార్, ఎలగందుల రవీందర్‌ను అభినందిస్తున్న జర్నలిస్టులు

సుభాష్‌నగర్, జూన్ 21: జర్నలిస్టుల సమస్యలపై పోరాడేది టీయూడబ్ల్యూజే (ఐజేయూ) సంఘం మాత్రమేనని టీయూడబ్ల్యూజే(ఐజేయూ) రాష్ట్ర మాజీ అధ్యక్షుడు నగునూరి శేఖర్ అన్నారు. టీయూడబ్ల్యూజే(ఐజేయూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన బుర్ర సంపత్‌కుమార్, కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికైన ఎలగందుల రవీందర్‌ను శుక్రవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో జర్నలిస్టులు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరీంనగర్‌లో అర్హులైన ప్రతి జర్నలిస్టులకు ఇళ్ళ స్థలాలు సాధించడం సంఘం బాధ్యత అని అన్నారు. 2006 తరువాత జర్నలిస్టులకు ఇళ్ళ స్థలాలు ఇవ్వలేదన్నారు. కార్యక్రమంలో కొండ లక్ష్మణ్, గాండ్ల శ్రీనివాస్, బల్మూరి విజయసింహారావు, ఈద మధుకర్‌రెడ్డి, చంద్రశేఖర్, రవి తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం

కరీంనగర్ అర్బన్, జూన్ 21: కరీంనగర్ కట్టరాంపూర్‌లో నివాసం ఉంటున్న మంచిర్యాల భీమారం గ్రామానికి చెందిన అనపర్తి రితిక్(24) ఈ నల 16వ తేదీ నుంచి అదృశ్యమయ్యాడని అతని భార్య ఫిర్యాదు చేశారని కరీంనగర్ ఒకటో టౌన్ పోలీసులు తెలిపారు. రితిక్ కారుడ్రైవర్‌గా పనిచేస్తుండగా అతని భార్య ఒక మందులషాపులో పనిచేస్తున్నదని తెలిపారు. ఈ నెల 16న భార్యను స్కూటీపై మందులషాపు వద్ద దిగబెట్టిన రితిక్ అప్పటి నుంచి కనపడకుండా పోయాడని ఫిర్యాదులో పేర్కొన్నారని తెలిపారు. రితిక్ ఫోన్ స్విచాఫ్ వస్తుందని, అతని ఆచూకీ కనుగొని అప్పగించాలని బాధితురాలు పోలీసులకు కోరుతున్నది. అదృశ్యం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గణేశ్‌నగర్, జూన్ 21: నగరంలో చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా శనివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ టు, ఏడిఈ, సుధీర్‌కుమార్ తెలిపారు. సప్తగిరి కాలనీలో కొంత భాగం, రామచంద్రాపూర్ కాలనీ, ఏపీఎస్ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం







పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో యోగాసనాలు చేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది, యోగ సాధన చేస్తున్న క్రీడా పాఠశాల విద్యార్థులు, హుజూరాబాద్‌లో..

భగత్‌నగర్, జూన్ 21: ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని కొత్తపల్లి మండలంలో పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో వేడుకలను నిర్వహించారు. కొత్తపల్లి పట్టణంలోని అల్ఫోర్స్ హైస్కూల్‌లో విద్యార్థులు యోగాసనాలు వేసి ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా అల్ఫోర్స్ విద్యాసంస్థలో ఎన్‌సీసీ సమన్వయంతో నిర్వహించిన కార్యక్రమంలో ఛైర్మన్ వి నరేందర్‌రెడ్డి, పాఠశాల ప్రిన్సిపల్ ఎన్‌సీసీ కేడెట్స్ పూజశ్రీ, సూర్యప్రకాష్, యోగా శిక్షకుడు లక్ష్మణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

● స్థానిక ఐవీహై హైస్కూల్‌లో పాఠశాల విద్యార్థుల యోగాసనాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ పసుల మహేష్, ప్రముఖ యోగా శిక్షకురాలు శివ మాధవి, విద్యార్థులు పాల్గొన్నారు.

● కొత్తపల్లి శివారులోని సెయింట్‌జార్జ్ ఇంటర్నేషనల్ పాఠశాలలో యోగదినోత్సవ వేడుకల సందర్భంగా విద్యార్థులు యోగాసనాలు వేశారు. ఈ కార్యక్రమానికి యోగా కోచ్ ప్రవీణ్ కుమార్ హాజరై విద్యార్థులకు యోగాసనాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చైర్మన్ పి పాతిమారెడ్డి, ప్రిన్సిపల్ భార్గవ్, నిరంజన్, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

కరీంనగర్ క్రైం: అంతర్జాతీయ యోగ దినోత్సవం సందర్భంగా పోలీస్ కమిషనరేట్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం కరీంనగర్ పోలీసులు యోగా కార్యక్రమం నిర్వహించారు. దాదాపు 100 మంది పోలీసులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అడిషనల్ డీసీపీ ఏ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ యోగా చేయడం వలన కలిగే ప్రయోజనాలను సిబ్బందికి తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ (ఆర్మ్‌డ్ రిజర్వు) అనోక్ జయ్‌తో పాటు రిజర్వు ఇన్‌స్పెక్టర్లు రజినీకాంత్, కుమారస్వామి, శ్రీధర్‌రెడ్డి, సురేష్, ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ ప్రతినిధులు, కరీంనగర్ జిల్లా బాడీ బిల్డింగ్ సెక్రెటరీ దామోదర్ పాల్గొన్నారు.

కరీంనగర్ స్పోర్ట్స్: నగరంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్టేడియంలో పతాంజలి యోగసమితి, భారత్ ఆయుష్ డిపార్ట్‌మెంట్, నెహ్రూ యువ కేంద్రం, సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యోగా దినోత్సవాన్ని కరీంనగర్ ఆర్డీవో కె మహేశ్వర్ రావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. పతాంజలి యోగసమితి అధ్యక్షుడు వి లక్ష్మీనారాయణ, నెహ్రూ యువకేంద్రం కోఆర్డినేటర్ వెంకటరాజబాబు, ఏసీపీ నరేందర్, ఎన్‌వైకే ప్రోగ్రాం ఆఫీసర్ రవీందర్, యువ భారత్ రాష్ట్ర అధ్యక్షుడు ముత్యాల రమేష్ పాల్గొన్నారు.

● నగరంలోని మహాత్మాజ్యోతిబా పూలే మైదానంలో ఫిట్నెస్ లైఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో మేయర్ వై సునీల్‌రావు, కార్పొరేటర్ వాల రమణారావు పాల్గొన్నారు. మానేరు విద్యాసంస్థలో జరిగిన కార్యక్రమంలో విద్యా సంస్థల అధినేత కడారి అనంతరెడ్డి, డైరెక్టర్ కడారి సునీతరెడ్డి, ఎండీ కడారి కృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● పారమిత విద్యాసంస్థల్లో జరిగిన వేడుకల్లో విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఈ ప్రసాద్‌రావు, యోగా శిక్షకుడు ఉదయ్‌కిరణ్‌రెడ్డి, డైరెక్టర్లు అనూకర్ రావు, రమణ, వినోద్‌రావు, ప్రసాద్, హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

● ఐవీవై ఇంటర్నేషనల్ పాఠశాలలో యోగా శిక్షకురాలు శివ మాదవి ఆధ్వర్యంలో చిన్నారులకు యోగాసనాలు తెలియచేశారు. పాఠశాల చైర్మెన్ పసుల మహేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● బ్లూబెల్స్ ఉన్నత పాఠశాలలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ గంగా సునీత, మనోహర్‌రెడ్డి, విద్యార్థినీ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● మాదవసేవా సమితి ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ఆసనాలు ప్రణయామం చేశారు. కార్యక్రమంలో విభాగ్ ప్రచారక్ భానూజి, ఆర్ఎస్ఎస్ జిల్లా సహ సంచాలక్ ఎలగందుల సత్యం, మాదవసేవా సమితి సంయుక్త కార్యదర్శి కామారపు ప్రసాద్, సభ్యులు పాల్గొన్నారు.

● యోగను విశ్వవ్యాప్తం చేసిన ఘనత భారత దేశానిదేనని తెలంగాణ రాష్ట్ర యోగ అసోసియేషన్ ఛైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్ అన్నారు. స్థానిక క్రీడా పాఠశాలలో జిల్లా యువజన క్రీడా శాఖ, జిల్లా యోగా అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం యోగ రాష్ట్ర జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులను సన్మానించారు. జిల్లా యోగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి సిద్దారెడ్డి, ప్రాంతీయ క్రీడాపాఠశాల ప్రిన్సిపల్ లీలాప్రసాద్ పాల్గొన్నారు.

● కోతిరాంపూర్‌లోని అచీవర్స్ ఆక్టివ్ స్కూల్‌లో పాఠశాల డైరెక్టర్ వెంకటేశ్వర్లు, ప్రిన్సిపల్ సీహెచ్ పల్లవి, అసోసియేషన్ అఫ్ అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్, కోలా అన్నారెడ్డి, పూలల శ్యాం సంయుక్తంగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు యోగాసనాలను ప్రదర్శించారు.

● ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రముఖ యోగాచార్యులు సంపత్ కుమారాచార్య విచ్చేసి ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ వలంటీర్లతో యోగాసనాలు చేయించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. కె. రామకృష్ణ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ గెజిటెడ్ అధ్యాపకుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. కె సురేందర్ రెడ్డి, స్టాఫ్ సెక్రెటరీ డా ఎ శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ అధికారులు పాల్గొన్నారు.

హుజూరాబాద్: పట్టణంలో బీజేపీ పట్టణాధ్యక్షుడు గంగిశెట్టి రాజు ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు పలు యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో వొడ్నాల విజయ్, తూర్పాటి రాజు, పైళ్ల వెంకటరెడ్డి, సుమన్, రాజు, శ్రీనివాస్, ప్రభాకర్ పాల్గొన్నారు.

హుజూరాబాద్ లీగల్: హుజూరాబాద్ కోర్టు ఆవరణలో జరిగిన యోగా కార్యక్రమంలో మున్సిఫ్ మేజిస్ట్రేట్ పద్మసాయిశ్రీ, యోగా శిక్షణ గురువు పత్తి వాసుదేవరెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గోస్కుల శ్రీనివాస్, మట్టెల తిరుపతి, ఏజీపీ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

శంకరపట్నం: మండలంలోని మొలంగూర్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు యోగా విశిష్టత, ప్రాధాన్యత గురించి ఆయుర్వేద వైద్యులు సంధ్యారాణి వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని సింగాపూర్ గ్రామంలోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో యోగా డే నిర్వహించారు. ఇండోర్ గేమ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో విద్యార్థులు, అధ్యాపకులకు కళాశాల అధ్యాపకురాలు వాణిశ్రీ యోగా శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో కిట్స్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ కందుకూరి శంకర్, ఈఈఈ విభాగాధిపతి యోగేష్ పుండలిక్, సమన్వయకర్త భాస్కర ప్రకాష్, సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్ బాలాజి బాపురావు పాల్గొన్నారు.

ఇల్లందకుంట: మండల కేంద్రంలోని రైతు వేదికలో బీజేపీ నాయకులు యోగాసనాలు వేశారు.

వీణవంక: మండల వ్యాప్తంగా యోగా డే నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో డాక్టర్ రవికుమార్, డాక్టర్ షబానా, సంపత్, కేజీబీవీ స్పెషల్ అధికారి లావణ్య పీఈటీ మౌనిక తదితరులు పాల్గొన్నారు.

మానకొండూర్: మానకొండూర్‌లోని బాలుర ఉన్నత పాఠశాలలో బీజేపీ మండల అధ్యక్షుడు రాపాక ప్రవీణ్ ఆధ్వర్యంలో యోగా వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జి రమేశ్, మొగిలి, రాజిరెడ్డి, శ్రీనివాస్, బలరాం, వరప్రసాద్, కార్యకర్తలు పాల్గొన్నారు.

చొప్పదండి: మండలంలోని ప్రభుత్వ, ప్రవేటు పాఠశాలలో విద్యార్థులు యోగాసనాలను ప్రదర్శించారు. రుక్మాపూర్ మోడల్ స్కూల్, రాగంపేట జడ్పీ స్కూల్‌లో యోగాలో విద్యార్థులు పాల్గొన్నారు.

గంగాధర: మండలంలోని గురుకుల పాఠశాలలో జరిగిన యోగా దినోత్సవానికి సెంట్రల్ సెన్సార్ బోర్డు సభ్యుడు కల్యాణ్‌చంద్ర పాల్గొన్నారు.

తిమ్మాపూర్: మండల వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో, రాజకీయ పార్టీలు, ప్రజలు యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. జ్యోతిష్మతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ అటానమస్ కళాశాలలో జ్యోతిష్మతి విద్యా సంస్థల చైర్మన్ జువ్వాడి సాగర్ పాల్గొని ప్రారంభించారు. వాగేశ్వరి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో వాగేశ్వరి విద్యాసంస్థల జనరల్ సెక్రటరీ జి శ్రీనివాస్‌రెడ్డి హాజరై మాట్లాడారు. అలుగునూర్‌లో గల పారమిత వరల్డ్ పాఠశాలలో పారమిత విద్యాసంస్థల చైర్మన్ ప్రసాద్‌రావు మాట్లాడారు. మండలంలోని కొత్తపల్లిలో గల ఓ ఫంక్షన్ హాలులో బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో యోగా దినోత్సవం నిర్వహించారు.





కొత్తపల్లి అల్ఫోర్స్ హైస్కూల్‌లో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు, అచీవర్స్ పాఠశాలలో..

ప్రొఫెసర్ జయశంకర్‌కు ఘన నివాళి



హుజూరాబాద్‌లో జయశంకర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

సుభాష్‌నగర్, జూన్ 21: జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయంలో తంసా ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్ర మంలో జిల్లా వ్యవసాయ అధికారి బి శ్రీనివాస్, ఏడీఏ జ్యోతి, ఏడిఏ అంజనీ, ఏవో స్వప్న, తంసా అధ్యక్షుడు ఎం హరికృష్ణ, కోశాధికారి షేక్ అంజద్, ఉపాధ్యక్షులు శ్యామల, మినాజ్, రమేశ్, రాజన్న, సురేందర్, బేగ్, జావిద్, దేవేంద్ర పాల్గొన్నారు.

కరీంనగర్ టౌన్: తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం తన జీవితాన్ని ధారబోసిన మహోన్నతశక్తి ఆచార్య జయశంకర్ సార్ అని మేయర్ యాదగిరి సునీల్‌రావు కొనియాడారు. తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య జయశంకర్ వర్ధంతి సందర్భంగా టవర్‌సర్కిల్‌లోని ఆయన విగ్రహానికి మేయర్ యాదగిరి సునీల్‌రావు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు, ఆటో డ్రైవర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

హుజూరాబాద్: హుజూరాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా, కరెం టు ఆఫీస్ ఎదుట విశ్వకర్మ మనమయ సంఘం, స్వర్ణకార సంఘం, బులియన్ మర్చంట్, విశ్వబ్రాహ్మణ సహకార సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం ప్రొఫెసర్ జయ శంకర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిం చారు. అనంతరం విశ్వకర్మ మనమయ సంఘంఅధ్యక్షుడు చల్లూరి రఘుచారి మా ట్లాడుతూ ఈటల రాజేందర్ కాంప్లెక్స్‌లోని కరెంటు ఆఫీస్ ఎదుట ఉన్న ప్రాంతాన్ని ప్రొఫెసర్ జయశంకర్ చౌరస్తాగా మార్చాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సదానందంచారి, నర్సింహాచారి, రాజు, నాగరాజు, సుధాకర్, విశ్వప్రసాద్, రత్నాచారి, సత్యనారాయణ, శ్రీనివాస్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

శంకరపట్నం: మండల కేంద్రంలో విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం మండలాధ్య క్షుడు తాటికొండ సదానందంచారి ఆధ్వర్యంలో జయశంకర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కృష్ణచారి, రమేశ్‌చారి, సంతోష్‌చారి, శ్రీని వాస్‌చారి, సమ్మయ్యచారి, రాజమౌళి, శ్రీనివాస్, కుమార్ పాల్గొన్నారు.

సైదాపూర్: సోమారం మోడల్ స్కూల్‌లో ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పర్హాణ, ఉపాధ్యాయులు అశోక్‌రెడ్డి, చంద్రారెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖ మంత్రిని నియమించాలి

హుజూరాబాద్, జూన్ 21: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విద్యాశాఖ మంత్రిని నియమించాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అజయ్ అన్నారు. పట్టణంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విద్యాసంస్థలు ప్రారంభమైనప్పటికి విద్యాశాఖకు మంత్రిని నియమించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. మద్యం శాఖ మీద ఉన్నంత దృష్టి విద్యాశాఖపై లేదన్నారు. వెంటనే విద్యాశాఖకు మంత్రిని నియమించి విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వ తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బండి సంజయ్ పర్యటనలో దొంగల చేతి వాటం

హుజూరాబాద్, జూన్ 21: కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా బండి సంజయ్‌కుమార్ ఎన్నికై మొట్ట మొదటి సారిగా శుక్రవారం హుజూరాబాద్‌కు వచ్చిన సందర్భంగా జేబు దొంగలు చేతి వాటం ప్రదర్శించారు. అంబేద్కర్ చౌరస్తాలో బండి సంజయ్‌కుమార్ స్వాగతం పలికే సమయంలో బీజేపీ కార్యకర్తలు, నాయకుల జేబుల్లో నుంచి సుమారు రూ. 50వేల వరకు దొంగలించారు. దీనిపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద సీసీ కెమెరాలు పనిచేయడం లేదని పోలీసులు సమాధానం చెప్పారు. దీంతో బాధితులు లబోదిబోమంటున్నారు. పట్టణ నడిబొడ్డున ఉన్న సీసీ కెమెరాలు పనిచేయకపోవడంపై పలువురు విమర్శిస్తున్నారు.

విద్యార్థులు నైపుణ్యం పెంపొందించుకోవాలి



రికార్డులను పరిశీలిస్తున్న డీఈవో జనార్దనరావు

గన్నేరువరం, జూన్ 21: పదో తరగతి విద్యార్థులు ఇంగ్లీష్‌తో పాటు స్టోరీ రైటింగ్‌లో నైపుణ్యం పెంపొందించుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దనరావు అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు మండలంలోని చొక్కారావుపల్లి, గోపాల్‌పూర్ గ్రామాలలో పునఃప్రారంభమైన ప్రాథమిక పాఠశా లలను శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారి సందర్శించారు. పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా ప్రణాళికా బద్ధంగా ఉపాధ్యాయులు విద్యాబోధన చేయాలని చెప్పారు. చొక్కారావుపల్లి పాఠశాలను ఇటీవల పునఃప్రారంభించిన సందర్భంగా పాఠశా లను సందర్శించారు. గ్రామస్థుల సహకారంతో 23మంది విద్యార్థులను బడిబాట కార్యక్రమంలో పాఠశాలలో చేర్పించిన ఉపాధ్యాయుడు నేలమడుగు శ్రీధర్ ను అభినందించారు. అనంతరం గోపాల్‌పూర్‌లో శుక్రవారం పునఃప్రారంభించిన ప్రాథమిక పాఠశాలను సందర్శించి, గ్రామాలలో వందశాతం ప్రభుత్వ పాఠశాలల్లో చేరేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు రామయ్య పాల్గొన్నారు.

'ప్రైవేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి'

జమ్మికుంట, జూన్ 21: జమ్మికుంట పట్టణంలోని ప్రైవేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం జిల్లా నాయకులు అన్నారు. శుక్రవారం మండల విద్యాధికారి విడప శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రైవేట్ విద్యా సంస్థల్లో విద్యార్థుల తల్లిదండ్రుల దగ్గర నుంచి అధిక ఫీజులు వసూళ్లు చేస్తున్నారని, యాజమాన్యం చెప్పిన బుక్‌స్టాళ్లలో మాత్రమే నోట్ పుస్తకాలు కొనుగోలు చేయాలని ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రైవేట్ విద్యా సంస్థల్లో కనీస మౌలిక వసతులు లేవన్నారు. అధికారులు తనిఖీలు చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రయాణికుడి డబ్బు అప్పగించిన ఆర్టీసీ అధికారులు

కరీంనగర్ టౌన్, జూన్ 21: రంగారెడ్డి జిల్లాకు చెందిన జోలి పవన్ అనే ప్రయాణికుడు మంచిర్యాల డిపో బస్‌లో మంచిర్యాల నుంచి హైదరాబాద్‌కు వెళ్తుండగా మార్గమధ్యంలో పెద్దపల్లి బస్ స్టేషన్‌లో మూత్ర విసర్జన కోసం బస్సు దిగారు. ఆ సమయంలో ఆయన వెంట తెచ్చుకున్న బ్యాగును బస్సులోనే వదిలి వెళ్లగా మూత్ర విసర్జన చేసి వచ్చేసరికి బస్సు వెళ్లిపోయింది. దీనితో సదరు ప్రయాణికుడు ఆన్ డ్యూటీ సెక్యూరిటీ గార్డు పి రమేశ్‌కు విషయం తెలుపగా ఆయన వెంటనే కరీంనగర్‌లోని సెక్యూరిటీ సిబ్బందికి తెలిపారు. దీంతో కరీంనగర్ బస్‌స్టేషన్‌లో ఆన్ డ్యూటీ డ్రైవర్ ఆ బ్యాగును స్వాధీనం చేసుకొని బస్‌స్టేషన్ ట్రాఫిక్ మేనేజర్ రజనీకృష్ణకు అందజేశారు. స్టేషన్ మేనేజర్ ఎన్ అంజయ్యతో కలిసి బ్యాగ్‌ను తనిఖీ చేయగా అందులో మూడు లక్షలు ఉన్నట్లు గుర్తించారు. ఆధారాలు చూపించడంతో జోలి పవన్‌కు మూడు లక్షల రూపాయల బ్యాగ్‌ను అప్పగించారు.

డ్రగ్స్ మహమ్మారిని పారదోలాలి

కరీంనగర్ క్రైం, జూన్ 21: డ్రగ్స్ మహమ్మారిని కూకటివేళ్లతో పారదోలాలని కరీంనగర్ ఒకటో టౌన్ ఎస్ఐ స్వామి పిలుపునిచ్చారు. కరీంనగర్ శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో శుక్రవారం మత్తుపదార్థాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ స్వామి మాట్లాడుతూ డ్రగ్స్‌కు బానిసలు కాకుండా విద్యార్థులు, తోటి స్నేహితులను కూడా అప్రమత్తం చేయాలన్నారు. మంచి భవిష్యత్ ఉండే విద్యార్థులు అనర్థాలకు మూలమయ్యే డ్రగ్స్ బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు, పోలీసులు పాల్గొన్నారు. కరీంనగర్ పారమిత హైస్కూల్‌లో గురువారం కరీంనగర్ రెండో టౌన్ సీఐ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో మత్తుపదార్థాలపై అవగాహన కల్పించారు.

హైదరాబాద్‌కు తరలివెళ్లిన నాయకులు

గంగాధర, జూన్ 21: చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సతీమని రూపదేవి ఆత్మ చేసుకోవడంతో గంగాధర మండల కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు హైదరాబాద్‌కు తరలివెళ్లారు. గంగాధర మండల ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, నాయకులు అంతిమయాత్రలో పాల్గొనడానికి హైదరాబాద్‌కు వెళ్లారు.

నేడు నీటి సరఫరాలో అంతరాయం

హుజూరాబాద్, జూన్ 21: మిషన్ భగీరథ ప్రధాన పైపులైన్ మరమ్మత్తుల నిమిత్తం శనివారం ఉదయం 2గంటల నుంచి సాయంత్రం 8గంటల వరకు నీటి సరఫరాలో అంతరయం ఏర్పడుతుందని హుజూరాబాద్ మిషన్ భగీరథ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హుజూరాబాద్, హుస్నాబాద్ నియోజకవర్గంలోని జమ్మికుంట, హుజూరాబాద్, ఇల్లందకుంట, కమలాపూర్, ఎల్కతుర్తి మండలాల్లో నీటి సరఫరా నిలిపి వేస్తున్నట్లు పేర్కొన్నారు.

● సంక్షిప్త సమాచారం..

కరీంనగర్ టౌన్: కరీంనగర్‌కు స్మార్ట్‌సిటీ మంజూరీలో కానీ, కరీంనగర్ అభివృద్ధికి నిధులు తేవడంలో కానీ ఎంపీ, కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ పాత్ర లేదని, స్మార్ట్‌సిటీ మంజూరీ చేయించిది.. నిధులు తెచ్చింది కూడా ఆనాటి ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమారేనని బీఆర్ఎస్ పార్టీ జిల్లా మాజీ అధికార ప్రతినిధి గుంజపడుగు హరిప్రసాద్ ఒక ప్రకటనలో అన్నారు.

కరీంనగర్ కల్చరల్: అఖిల భారత అయ్యప్ప దీక్షా ప్రచార సమితి (ఏబిఏడిపిఎస్) జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీరాజ్ దేశ్‌పాండే గురుస్వామి స్వీయ పర్యవేక్షణలో శనివారం వైశ్యభవన్‌లో ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు 'నీ గానమే నా ప్రాణం' పేరుతో నిరంతర అఖండ భజన, రాత్రి 7-30 గంటల నుంచి అయ్యప్ప స్వామి మహా పడిపూజ నిర్వహిస్తున్నట్లు ఉత్సవ చీఫ్ కోఆర్డినేటర్‌లు మెతుకు హేమలత పటేల్, నలుమాచు చంద్రశేఖర్ తెలిపారు.

● నగరంలోని భగత్‌నగర్ జడ్పీ క్వార్టర్స్ ఆవరణలో గల ప్రాచీన వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలను శనివారం నుంచి మంగళవారం వరకు నిర్వహిస్తున్నట్లు ఈవో కొన్న కాంతారెడ్డి తెలిపా రు.

● తెలంగాణ రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10-30 గంటల నుంచి ముఖరంపుర వాగీశ్వరి డిగ్రీ కళాశాలలో సంపాదకుడు, గ్రంథ ప్రచురణ కర్త, తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య అనుమాండ్ల భూమయ్యచే వెలువరించిన 'కరీంనగర్ కవులు నాడు-నేడు' పుస్తకావిష్కరణ నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్ష కార్యదర్శులు కొత్త అనిల్‌కుమార్, దొమ్మాటి శంకర్‌ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.

● తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం 7 గంటలకు విద్యానగర్ సేయింట్ జాన్స్ స్కూల్ పక్క వీధిలో మహాశక్తి ఆలయం వెనుక గల సప్తగిరి రెసిడెన్సీలో 134వ ఎన్నీల ముచ్చట్లు నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష కార్యదర్శులు సీవి కుమార్, దామరకుంట శంకరయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

● నగరంలోని మంకమ్మతోట వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. సాయంత్రం విశ్వక్సేనారాధన, పుణ్యాహవాచనం, రక్షాబంధనం శాస్త్రోక్తంగా జరిపారు.

● నగరంలోని భగత్‌నగర్ అంజనాద్రి ప్రసన్నాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి శత కలశాలతో అభిషేకం, విశేషాలంకారం, అర్చన, హారతి జరిపారు.

కరీంనగర్ రూరల్: మండలంలోని నగునూర్ గ్రామ శివారులోని దుర్గభవాని ఆలయంలో పౌర్ణమి సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మాధికారి, వేదపండితులు పురాణం మహేశ్వరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి.

తిమ్మాపూర్: యువత వ్యసనాల బారిన పడి భవిష్యత్తును పాడుచేసుకోవద్దని సీఐ కె.స్వామి అన్నారు. శ్రీ చైతన్య డిఫెన్స్ అండ్ స్పోర్ట్స్ అకాడమిలో మత్తు పదార్థాలు, గంజాయి వల్ల కలిగే దుష్పరిణామాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తిమ్మాపూర్ ఎస్సై చేరాలు తదితరులు పాల్గొన్నారు.

గన్నేరువరం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు ఎంపీపీ లింగాల మల్లారెడ్డి ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్, తహసీల్దారు భిక్షపతి, ఎంపీడీవో శంకర్, ప్రధానోపాధ్యాయుడు రామయ్య పాల్గొన్నారు.

వీణవంక: మండలంలోని మామిడాలపల్లికి చెందిన సింగరవేణి తిరుపతి ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి 10వేల రూపాయల ఆర్థిక సాయాన్ని శుక్రవారం జిల్లా ఫిషర్‌మెన్ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి మల్లేష్, మండల అధ్యక్షులు ఎలవేణి సదయ్య అందజేశారు.

గణేశ్‌నగర్: నీట్, నెట్ పరీక్ష నిర్వహించడంలో విఫలమైన ఎన్‌టీఏ సంస్థని ప్రక్షాళన చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్ డిమాండ్ చేశారు.

చొప్పదండి: ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం భార్య రూప దేవి అంత్యక్రియలకు మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు హైదరాబాదు తరలివెల్లారు. మాజీ ఎమ్మెల్యే బొడిగ శోభతో పాటు నియోజక వర్గానికి చెందిన పలువురు ఎమ్మెల్యేను పరామర్శించారు.

హుజూరాబాద్: పట్టణంలోని ఆటో స్టాండ్ వద్ద ధార్మిక సెల్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ కాశెట్టి కుమార్, సామాజిక కార్యకర్త నలబాల వేణుగోపాల్ ఆధ్వర్యంలో శుక్రవారం మొక్కలు నాటారు. కార్యక్ర మంలో శేషయ్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.